## క్లుప్తంగా

### బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: విజయవాడ వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థి సుందెపోగు సుధీర్‌కు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిదులు గురువారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటప్రసాద్ చేదుల మీదుగా రూ.4 0వేలు విలువైన ల్యాప్ టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు అండగా నిలబడుతున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ సేవలు అభినందనీమన్నారు. సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ అంబడిపూడికి చెందిన సుధీర్ ప్రాజెక్టు వర్క్ నిమిత్తం ల్యాప్ టాప్ అందజేసినట్లు చెప్పారు.

### తెలంగాణ మద్యం పట్టివేత

అచ్చంపేట: మండల సరిహద్దులోని కృష్ణా నదికి ఆవలి వొడ్డున ఉన్న తెలంగాణలోని దొండపాడు గ్రామం నుంచి మద్యం బాటిల్స్‌ను పులిచింతల ప్రాజెక్టు మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకు వస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. గింజుపల్లి తండాకు చెందిన భూక్యా రమణానాయక్ ద్విచక్ర వాహనంపై పులిచింతల ప్రాజెక్టు మీదుగా అడవి మార్గంలో అచ్చంపేట మండలం వైపు మద్యం బాటిల్స్ తీసుకువస్తున్నాడన్న సమాచారం అందినట్లు చెప్పారు. ఓల్డ్ అడ్మిరల్ 80 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

### ముఠా కార్మికుల నిరసన



పెదకూరపాడు(అమరావతి): పౌర సరఫరాల శాఖ ముఠా కార్మికులకు కూలీ రేట్ల అగ్రిమెంట్ ఏరియర్స్‌తో కూడిన జీవోను వెంటనే విడుదల చేయాలని పెదకూరపాడు ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పౌర సరఫరాల శాఖ గిడ్డంగి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పని భద్రత కల్పించాలని, ప్రతి నెలా పదో తేదీ లోపు బిల్లులు చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రెండవ రోజు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన నిర్వహించారు. చిన్ని యాకోబు, రతన్ రాజు, అనిల్ కొండలరావు సుధాకర్ పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి చదరంగం పోటీలకు విద్యార్థులు



క్రోసూరు: స్థానిక జై భారత్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి చదరంగం ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల డైరెక్టర్ జైనేంద్ర రెడ్డి గురువారం తెలిపారు. పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. అండర్ 14 విభాగంలో ఎనిమిదవ తరగతి విద్యార్థి షేక్ ఆరిఫ్ ప్రథమ, అండర్ 17 విభాగంలో తొమ్మిదవ తరగతి విద్యార్థి జి.తులసి శ్రీ చైతన్య ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. క్రోసూరులో నిర్వహించిన అండర్ 14 కేటగిరిలో 400 మీటర్స్ రిలే రన్నింగ్ పోటీల్లో 6వ తరగతి విద్యార్థి కె.సిద్దార్థ జిల్లా స్థాయికి ఎంపికైందన్నారు. విజేతలగా నిలిచిన విద్యార్థులకు డైరెక్టర్‌తో పాటు పీఈటీ, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ



దొడ్లేరు(క్రోసూరు): మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ దొడ్లేరు గ్రామంలోని ఎరువుల షాపులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు తగు సూచనలు చేశారు. ఎరువులను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం డీలర్ల పై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.
డీలర్లు ప్రతిరోజు షాపులో ఎరువుల స్టాక్, ధరల వివరాలను రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. ఎరువులు విక్రయించిన వెంటనే బిల్లుపై రైతు ఫోన్ నెంబర్ కూడా రాసి, అందచేయాలన్నారు. యూరియా గరిష్ట విక్రయ ధర రూ.266.50 అలాగే, మిగిలిన ఎరువులను బస్తాలపై ధరలకు అనుగుణంగా డీలర్లు విక్రయించాలని డిమాండ్ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డీలర్లు తమ షాపు ఎదుట ఏవో ఫోను నంబరు 83310 56937, ఏడీఏ నంబరు 83310 56936 రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు.

# ఉత్సాహంగా ఆటల పోటీలు



బాడ్మింటన్ ఆడుతున్న విద్యార్థినులు



తీక్షణంగా ఎత్తుకు పైఎత్తు వేస్తూ

పెదకూరపాడు(అమరావతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. అచ్చంపేట, కోసూరు, అమరావతి, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రధానోపాధ్యాయుడు కేవీ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. ఐదు మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు బ్యాడ్మింటన్, చెస్ పోటీలలో పాలొన్నారని చెప్పారు. శుక్రవారం అచ్చంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్ నియోజకవర్గస్థాయి ఎంపికలు నిర్వస్తామని స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ వి.నాగరాజు తెలిపారు. జీఆర్‌సీకే డైరెక్టర్ రాము, ప్రిన్సిపల్ కవిత, సాంబశివరావు రాధాకృష్ణ మురళీధర్ అనురాద, ముత్యాల శ్రీనివాసరావు పూర్ణ, నాగమణి పాల్గొన్నారు.

## న్యాయవాదుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్
- విధులు బహిష్కరించి నిరసన



న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసనలో న్యాయవాదులు

సత్తెనపల్లి: ప్రభుత్వాలు న్యాయవాదుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి పట్టణంలోని న్యాయ స్థానాల ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాల తీరును న్యాయవాదులు ఖండించారు. న్యాయవాది పూజల వెంకట కోటయ్య మాట్లాడుతూ న్యాయవాదులు తమ హక్కులు కాపాడుకునేందుకు ప్రభుత్వంతో పోరాటం చేయక తప్పదన్నారు. ఐఏఎల్ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పై ఐఏఎల్ రాష్ట్ర కమిటీ మొదటి నుంచి సహాయ సహకారాలు ఉన్నాయన్నారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరావు, న్యాయవాదులు కళ్ళం వీరభాస్కరరెడ్డి, చలువాది చిన్న సత్య నారాయణ, బోడపాటి లక్ష్మి చిన్నయ్య, కాకర్ల నాగ వెంకట హరిబాబు, ఊటుకూరి పాపారావు, జూపల్లి శేషయ్య, బూతుకూరి రామిరెడ్డి, శ్రీనివాసరావు, మాణిబాబు, విజయ్ కుమార్, సంగీతరావు, వెంకట శివ, బాబురావు, పాపారావు, నాగార్జున, తవ్వ హరినాథ్ పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ముప్పాళ్ళ: కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ కోరారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముగింపు వస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతాంగానికి ప్రకటించిన పథకాలను ప్రారంభించ లేదని, తక్షణమే ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు. కౌలు కార్డులు మంజూరు చేసి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి రూ.2 లక్షల వరకు పంట రుణాలు రద్దు చేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు జీవో నెం.22 రద్దు చేయాలన్నారు. వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్పుల వెంకటరెడ్డి, కందిమళ్ళ సాంబశివరావు, గారా జాలయ్య, కూరపాటి ప్రభాకర్, తొరటి అమరలింగేశ్వరరావు, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, బ్రహ్మయ్య, పెద్దిరెడ్డి, జాన్‌పీరా, ఏడుకొండలు, జగన్మోహనరెడ్డి, నూకారపు సాంబశివరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## పాత కక్షల నేపథ్యంలో యువకుల ఘర్షణ

సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల యువకుల మధ్య మారణాయుధాలతో ఘర్షణ జరిగిన ఘటన పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో గురువారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ ఖాసింవలి, షేక్ షరీఫ్ కూరగాయల మార్కెట్ వద్ద ఉండగా మార్కెట్‌కి ఎదురుగా షేక్.మొహమ్మద్ రఫీ మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నాడు. ఆ సమయంలో షేక్ ఖాసింవలి, షేక్ మహమ్మద్ రఫీల మధ్య మాటా మాటా పెరిగి ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. వీరిలో ఓ వర్గానికి చెందిన షేక్ ఖాసిం వలి, షేక్ షరీఫ్‌కు గాయాలు కాగా మరో వర్గంలో షేక్ మొహమ్మద్ రఫీ, ఉమర్, అల్తాఫ్‌కు గాయాలయ్యాయి. ఇరువర్గాల క్షతగాత్రులు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు. కాగా ఒక వర్గం ఐదుగురిపై, మరొక వర్గం ఇరువురి పై ఇరువర్గాలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

## స్కూల్ గేమ్స్ ఎంపికలు వాయిదా



జి.నరసింహారావు

సత్తెనపల్లి: చిలకలూరిపేటలోని మోడరన్ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న నిర్వహించాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బ్యాడ్మింటన్ క్రీడా ఎంపికలు, అక్టోబర్ 3న చిలకలూరిపేట ఏఎంజీ కళాశాల నందు నిర్వహించే నెట్ బాల్, జూడో పోటీలు వాయిదా వేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -19 జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా ఎంపికల నిర్వహణా తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. క్రీడాకారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## మాజీ మంత్రి అంబటికి అభినందనలు



సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన మాజీ మంత్రి అంబటి రాంబాబును సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండెం బాబురావు గురువారం అభినందించారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో అంబటి రాంబాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఆయన చర్చించారు.

## ఎంపీడీవో హనుమారెడ్డి బాధ్యతల స్వీకారం



బెల్లంకొండ: నూతన ఎంపీడీవోగా వై.హనుమారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎడ్లపాడు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చారు. గత రెండేళ్ల నుంచి ఈవోపీఆర్డీ బి.వెంకటరెడ్డి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది, రాష్ట్ర టీడీపీ నాయకులు పీఎస్కే మస్తాన్‌షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం అభినందనలు తెలిపారు.

## వేప ఉత్పత్తులతో పంటలకు ప్రయోజనం



బెల్లంకొండ: వేప ఉత్పత్తులు పంటలకు ఎంతో మేలు కలుగజేస్తాయని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. గురువారం బెల్లంకొండలో 'పొలం బడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కంది పంటలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం వేప ఉత్పత్తుల ద్వారా కలిగే ప్రయోజనాలను, వేప గింజల కషాయం తయారుచేయు విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరవి ద్రవ జీవామృతం తయారుచేసి, వాడే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నూరజహాన్, ఎంపీఈవోలు వై. శ్యామ్ ప్రకాష్, రహంతుల్లా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు గర్భస్రావం

- తీవ్రంగా గాయపడిన భర్త
- పోతురాజు గుట్టలో విషాదం
- కాన్పుకోసం పుట్టింటికి తీసుకెళ్తుండగా దుర్ఘటన



ప్రమాదస్థలంలో పడి ఉన్న దంపతులు

కారెంపూడి: నిండు గర్భిణి అయిన భార్యను కాన్పు కోసం ఆమె పుట్టింటికి తీసుకెళ్తుండగా విధి కన్నెర్ర జేసింది. సంతోషంగా జీవిస్తున్న చిరు కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఈ హృదయవిదారక ఘటన గుంటూరు సమీపంలోని బుడంపాడు వద్ద గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామ శివారు పోతురాజుగుట్టకు చెందిన కడమంచి ఏబేలు, దీనా దంపతులు. దీనా నిండు గర్భిణి. తొలి కాన్పు కావడంతో ఆమె పుట్టిల్లు మంగళగిరి మండలం నవులూరులో వదిలి పెట్టడానికి ఏబేలు బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో గుంటూరు సమీపంలోని బుడంపాడు వద్ద ముందు ఉన్న కారును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఏబేలు తీవ్రంగా గాయపడ్డాడు. దీనా పొట్టభాగానికి గాయం కావడంతో గర్భస్రావం అయింది. ఆమె గర్భాన్ని తొలగించి ప్రాణాలు కాపాడాలని, ఏబేలుకు గుండె బైపాస్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. రోజువారీ చిరువ్యాపారం చేసుకునే జీవించే వీరికి పెద్ద ఆపద రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఘటనతో పోతురాజుగుట్టలో ఉన్న బేడ బుడ్గ జంగాల కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సత్తెనపల్లి ఆర్డీఓగా వెంకట రమాకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఆర్డీఓగా గాజులపల్లి వెంకట రమాకాంత్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా 57 మందిని బదిలీ చేస్తూ.. గురువారం ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ప్రస్తుతం గురజాల ఆర్డీఓగా వెంకట రమాకాంత్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి ఆర్డీఓగా పనిచేస్తున్న వి.మురళీకృష్ణను గురజాల ఆర్డీఓగా బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆర్డీఓగాబాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణ సమర్థంగా పనిచేసినట్లు పేరు తెచ్చుకున్నారు. కానీ, ప్రభుత్వం డివిజన్ అధికారులను తప్పనిసరిగా బదిలీ చేయాలనే పాలసీ ప్రకారం బదిలీ జరిగినట్లు తెలుస్తోంది.

## రహదారుల ఆక్రమణలపై కఠిన చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దారు దానియేలు

పెదకూరపాడు(అమరావతి): రహదారులు, కాలవలు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దారు మీసాల దానియేలు అన్నారు. గురువారం స్థానికంగా అక్రమణలకు గురైన పలు రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు దానియేలు మాట్లాడుతూ పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎస్‌సీ శ్మశానికి వెళ్లే రహదారులు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇనుము తుక్కుగా మార్చే వ్యాపారం చేస్తూ అక్రమించినట్లు గుర్తించామన్నారు. ఈ ఆక్రమణల వల్ల పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు, ఆస్పత్రికి వెళ్లే రోగులు తీవ్ర దుర్వాసన వల్ల ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని, ఫిర్యాదులు కూడా వస్తున్నాయని చెప్పారు. పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, కార్యదర్శి సుధారాణితో కలిసి రహదారి ఆక్రమణలను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా వ్యాపార నిర్వాహకులకు మాట్లాడి మరోచోట వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు. రహదారి పక్కనే పశువుల ఎరువుల దిబ్బ, ప్లాస్టిక్ వ్యర్థాలను తక్షణం అక్కడి నుంచి తొలగించి భవిష్యత్‌లో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమదారులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పట్టణంలో మహా పాదయాత్రలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: తిరుమల లడ్డూను అపచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన తిరుమల పరిరక్షణ మహా పాదయాత్రని గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నేతిలో జంతువుల కొవ్వు పదార్థాలు వాడి హిందువులు మనోభావాలు దెబ్బతీసినటువంటి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. స్వామి వారి సేవలను వ్యాపార ధోరణిలో ఆలోచించి, స్వామి వారి దేవస్థాన పాలనను అన్యమతస్తులు నిర్వహించి అపవిత్రం చేసినందుకు దోషులను విచారించి కఠినంగా శిక్షించాలని కోరారు. ముందుగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద మహా పాదయాత్రను ఆయన ప్రారంభించి, వడ్డవల్లి కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన గోక్షీరంతో సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి బాధ్యులు, శ్రీవారి భక్తులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం**

సత్తెనపల్లి: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని 16వ వార్డులో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతుందన్నారు. ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించనున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికి తిరిగినప్పుడు తాను ఇచ్చిన హామీలన్నీ త్వరలోనే నెరవేరుస్తానని, ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ముందుగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి, స్టిక్కర్లు అంటించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురక మేరిగ్రేస్, వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, నాయకులు ఎల్.రవి, బలిజేపల్లి సురేష్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీలపై దాడులు నియంత్రించాలి



డీఎస్పీ హనుమంతరావుకు వినతిపత్రం అందిస్తున్న దాసు

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీల పై జరుగుతున్న దాడులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు గార్లపాటి దాసు కోరారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావును గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీల పై గ్రామాల్లో దాడులు, వారి భూములు, పొలాలు, ఇంటి నివేశన స్థలాలు కబ్జా చేయడం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్‌ల సబ్ ఇన్ స్పెక్టర్లతో గ్రామాల్లో చట్టాలపై అవగాహన సభలు ఏర్పాటు చేసి, దాడులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు దుగ్గి రాంబాబు, వేల్పుల అనిల్ ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు పాపయ్య

సత్తెనపల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని ప్రధానోపాధ్యాయుడు పాపయ్య అన్నారు. అబ్బూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హి సేవా- 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఆయన మాట్లాడారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. డీబీఆర్సీ రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలని, చదువు వల్ల కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. సచివాలయ సెక్రటరీ హుస్సేన్ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పాపయ్య స్వచ్ఛతా హి సేవా-2024 ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాణిక్యరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి

సత్తెనపల్లి: పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ధూళిపాళ్ల వాగు వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని యానాది కాలనీకి చెందిన చెన్నంశెట్టి శివమ్మ (35) చేపలు పట్టేందుకు ధూళిపాళ్ల వాగు వద్దకు వెళ్లగా పాము కాటు వేసింది. దీంతో భయాందోళన చెందిన ఆమె స్పృహ తప్పి పడిపోయి మృతి చెందింది. మృతురాలికి భర్త స్వామియేలు, కుమారుడు ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ లో మృతురాలి భర్త ఫిర్యాదు చేశాడు.

## విజయవాడ టు అమరావతి బస్సు సర్వీస్‌కు వినతి

అమరావతి: విజయవాడ నుంచి అమరావతి వరకు బస్ సర్వీస్‌ను నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్ కు గురువారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజయవాడలో బస్సు భవన్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదమద్దూరు వంతెనని తనిఖీ చేసి, రెండు మూడు రోజుల్లోపు ఫిట్మెంట్ నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని కోరామన్నారు. బ్రిడ్జి గురించి అర్అండ్‌బీ అధికారులు సూచనలు మేరకు బస్సులను పూర్తిగా విజయవాడ నుంచి అమరావతి వరకు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు. ఇటీవల వరదల వల్ల పూర్తిగా పెద మద్దూరు వంతెన, రోడ్డు దెబ్బతింది. బస్సులు ప్రస్తుతం వంతెన వరకు నడుపుతున్నారన్నారు. గురువారం నుంచి వంతెనకి అవతల వైపు నుంచి సెటిల్ సర్వీసును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. దీనివలన వృద్ధులు, దివ్యాంగులు వంతెన దాటి వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారులు భవనాల శాఖ, ఆర్టీసీ అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించి, నిర్ణయం తీసుకుని అమరావతి వరకు బస్ సర్వీస్ నడిపి ప్రజల ఇబ్బందులు తొలగించాలన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



సత్తెనపల్లి: వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు విరాళాలు సేకరించారు. గురువారం కొల్లూరు మండలంలోని రావిలంక, కృష్ణ నగర్ గ్రామాల 100 కుటుంబాలకు రూ.1.20 లక్షలు విలువైన నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ విద్యా సంస్థల అధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా నది వరదల వల్ల బాగా నష్టపోయిన పేదలు, రైతులను ఆదుకోవడంలో చాలా సంతృప్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ వెలుగూరి సుబ్బ రాయుడు, ప్రిన్సిపల్ గీతాంజలి, కొల్లూరు కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.